కథ

# శిథిల సంధ్యలో చిరుదీపం

గంగుల నరసింహారెడ్డి
90102 84700

ఉదయం పదిగంటలు. తానున్న ఓల్డేజ్ హోమ్ లైబ్రరీవైపు నడుస్తున్నాడు గోవిందం. అప్పుడే జేబులోని సెల్ ఫోన్ మోగింది. ఆ సమయంలో వచ్చే ఫోన్.. అమెరికాలో ఉన్న కొడుకు దగ్గర్నుంచేనని అతనికి తెలుసు. కెనడాలో ఉన్న కూతురు మాత్రం రాత్రి సమయంలో చేస్తుంటుంది.

''ఎట్లున్నవు నాన్నా!''.. రొటీన్ వాకబు అది.

''బాగనే ఉన్నరా!''.. గోవిందానిదీ రొటీన్ జవాబు.

''భోజనం, మిగతా సౌకర్యాలు ఫరవాలేదా?''.

''ఇక్కడ ఏ సమస్యా లేదురా!''..

కొడుకు సంతృప్తి కోసం పైకి చెప్పాడే కానీ, స్వగతంలో మాత్రం..

'సంతోషంగా మాత్రం లేను' అని అనుకున్నాడు.

మరో రెండు మూడు నిమిషాలపాటు సాధారణ విషయాలు మాట్లాడుకున్న తరువాత.. వారి సంభాషణ ఇతర సంగతుల వైపు మళ్లింది.

''ఊళ్లో ఇల్లును అమ్మేస్తే బాగుంటుందేమో నాన్నా''.

''అవున్రా! నేను కూడా అట్లనే అనుకుంటున్నా''.

అతనికీ ఆలోచన ఆరునెలల క్రితం ఈ ఓల్డేజ్ హోమ్‌లో జాయినయ్యే సమయంలోనే వచ్చింది. ఎందుకంటే పిల్లలిద్దరూ ఇండియాకు తిరిగి వచ్చే ప్రసక్తి లేదు. తన శేష జీవితమేమో ఇక ఈ ఓల్డేజ్ హోమ్‌లోనే తెల్లారేలా ఉంది.

''నీక్కూడా ఇష్టమైతే వచ్చే వారంలో ఓసారి ఊరికెళ్లి, నీకు తెలిసిన నలుగురైదుగురికి చెప్తే మంచిది. ఎవరో ఒకరు ముందుకొస్తారు''.

''సరే.. పోతానులే!'' అని చెప్పి, సంభాషణ ముగించాడు గోవిందం. లైబ్రెరీలో ఆనాటి దినపత్రికలు తిరగేసి, బయటికి వచ్చి తన గదివైపు నడిచాడు.

'ఆహ్లాద నిలయం' అనే పేరున్న ఆ ఓల్డేజ్ హోమ్.. శంషాబాద్ విమానాశ్రయం వైపు, ఔటర్ రింగు రోడ్డుకు సమీపాన ఉంటుంది. పేరుకు తగ్గట్టుగానే ఆహ్లాదకరమైన వాతావరణంలో వృద్ధులకు అవసరమైన సకల సౌకర్యాలతో ఉంటుంది. ఒక్కొక్కరికీ నెలకు ఇరవైఐదు వేల దాకా చార్జీలు తీసుకుంటారు.

అతని రిటైర్మెంట్‌కంటే ముందే పిల్లల పెళ్లిళ్లు జరిగిపోయాయి. వారు అంతకుముందే విదేశాల్లో స్థిరపడిపోయారు. రిటైర్మెంట్ తరువాత ఏ చీకూచింతా లేకుండా భార్యాభర్తలు ఆనందంగా గడుపుతున్న సమయాన.. విధి చిన్న చూపు చూసింది. కరోనా మహమ్మారికి గురై, అతని భార్య మరణించింది.

ఇక అప్పటినుంచి అతనికి ఒంటరి జీవితం దుర్భరమైపోయింది. ఇన్నాళ్లూ ప్రతి చిన్న విషయానికీ భార్యపై ఆధారపడి ఉన్నాడు. వంట కూడా రాదు. వంట మనిషిని పెట్టుకున్నా.. మరోరకం ఇబ్బందులు ఎదురైనాయి. అతని పరిస్థితిని చూసి బంధుమిత్రులు 'ఓల్డేజ్ హోమ్‌లో జాయిన్ అవ్వు!' అంటూ సలహా ఇచ్చారు. పిల్లలిద్దరూ తమ ఆమోదం తెలిపారు. మెహదీపట్నంలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను అద్దెకు ఇచ్చేసి, అరవై నాలుగేళ్ల వయసులో ఈ ఓల్డేజ్ హోమ్‌లో చేరిపోయాడు గోవిందం.

నిజానికి అప్పటినుంచి జీవితం నిశ్చింతగా, హాయిగా ఉంది. అతనికి నలభై వేల దాకా పెన్షన్, ఫ్లాట్ అద్దె పది వేలకుపైనే వస్తుంది. డబ్బులకు ఏమాత్రం ఇబ్బంది లేదు. పెద్దగా ఆరోగ్య సమస్యలు కూడా లేవు. అలా నాలుగు నెలలపాటు ఈ ఆహ్లాద నిలయంలో రోజులు ఆహ్లాదంగానే గడచిపోయాయి. కానీ, రెండు నెలలుగా అతనిలో తనకే తెలియని ఏదో అసంతృప్తి బయల్దేరింది. జీవితం సౌకర్యంగా ఉంది. కానీ, మనసు మాత్రం సంతోషంగా లేదు. రోజులు నిస్సారంగా గడచిపోతున్నాయనే దిగులు.. లోలోపల కుంగదీస్తున్నది. ఇప్పుడతనికి ఏ సమస్యా లేకపోవడం కూడా.. ఓ సమస్యగా అనిపిస్తున్నది.

గదికి చేరుకొని ఊరిలోని చిన్ననాటి స్నేహితుడు ఆచారికి ఫోన్ చేసి, ఇల్లు అమ్మాలనుకుంటున్నట్లు చెప్పాడు. ఆచారి నుంచి వెంటనే జవాబు రాలేదు. అతను బాధ పడుతున్నట్లుగా అర్థమైంది గోవిందానికి.

''ఆచారీ.. వినిపించిందా?'' తిరిగి తనే అడిగాడు.

''ఇనవడ్డదిరా! గా ఇల్లమ్మితే నువ్వింక మనూరి దిక్కు సూడనే సూడవు కద!''.. ఆచారి గొంతులో బాధ తెలుస్తూనే ఉంది.

''అవున్రా! నాక్కూడ కష్టంగానే ఉన్నది గానీ ఏం జేస్తం చెప్పు. మనం ముసలోళ్లం అయినం. మా పిల్లలు మనూరికొచ్చి ఉంటరనేది కలల్నే జరుగుతది. నా కొడుకే అమ్ముమని చెప్తున్నడు. నేను కూడ ఓల్డేజ్ హోమ్‌ల జాయినైన.. నీకు తెల్సుకద''.

''అవును.. నెల కిందట్నే చెప్పినవు''.

''ఇంకో ఐదారేండ్లకు నాక్కూడ శాత గాకుండైతది. అందుకే.. ఇప్పుడమ్మితెనే బాగుంటదనుకుంటున్న''.

''నీమాట కూడా నిజమేలే! వస్తే రెండుమూడు రోజులు ఉండేటట్లు రా! అట్లయితెనే సెటిలైతది. నువ్వొచ్చే ముందు జెప్తే.. ఇల్లు శుభ్రం చేయిస్త!'' అన్నాడు ఆచారి.

ఇంటి అదనపు తాళం చెవి ఒకటి ఆచారి దగ్గర పెట్టి ఉంచుతాడు గోవిందం. గతంలో తనెప్పుడు ఊరికెళ్లినా.. ఆచారి ఇంట్లోనే భోంచేస్తుండేవాడు. బదులుగా ఆచారికి అవసరమైనప్పుడు స్వల్ప మొత్తంలో ధన సహాయం చేస్తుంటాడు.

''వచ్చేవారంలో ఎప్పుడైనా సరే.. నీవు ఫోన్ చేస్తే నేను వచ్చేస్తా!''.

''కూలిమంది దొరికేది శాన కష్టంగుంది. అంతా పత్తేరనీకె, వరిచేను కోయనీకె పోతున్నరు. మంచి గుత్తలు వొస్తున్నయి. గుత్తలంటే.. కూలికంటె ఎక్కువని ఎగవడుతున్నరు. అందుకే.. లేటైతదేమో! అయినంక ఫోన్ చేసి చెప్త'' అన్నాడు ఆచారి.

''సరే!'' అని ముగించాడు గోవిందం.

* * *

మరో పదిరోజుల తరువాత ఆచారి నుంచి ఫోన్ వచ్చింది గోవిందానికి. ఇల్లు శుభ్రం

